క్లుప్తంగా

వైభవంగా రథోత్సవం



దాచేపల్లి : మండలంలోని పెదగార్లపాడు గ్రామంలో శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి పండుగ ముగిసిన తరువాత మూడో రోజున ప్రతి ఏటా ఈ గ్రామంలో రథోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తారు. విజయవాడ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పూలతో రథాన్ని అలంకరణ చేశారు. ప్రత్యేకంగా పూజలు చేసిన తరువాత రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఉత్సాహవంతులైన యువతీ, యువకులు రథంను లాగి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. శ్రీరామా నామస్మరణతో పెదగార్లపాడు మారుమ్రోగింది. ఎంపీపీ కటకం జయశ్రీ, సర్పంచ్‌లు కటికాల వరలక్ష్మీ, పుప్పాల శివ, ఉపసర్పంచ్ కర్పూరపు వెంకటకోటయ్యతో పాటు పలువురు రథం వద్ద పూజలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ షేక్ బిలాలుద్దీన్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అయ్యప్ప స్వామి విగ్రహానికి అగ్ని సంస్కారం



కారెంపూడి: అయ్యప్ప భక్తులు నూతనంగా చేయించిన అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహానికి కారెంపూడిలో ఆదివారం అగ్ని సంస్కారం, వివిధ ద్రవ్యాలచే స్నపన కార్యక్రమాలు జరుగుతాయని అయ్యప్పసేవా సమితి ప్రతినిధి సింగం బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమౌతాయని అయ్యప్ప భక్తులందరూ కార్యక్రమంలో పాల్గొనవల్సిందిగా కోరారు. దీక్షలు చేపట్టిన అయ్యప్పలు సామూహిక పూజాకార్యక్రమాలు నిర్వహించుకునే టప్పుడు స్వామివారిని కొలిచేందుకు వీలుగా పంచలోహ విగ్రహాన్ని చేయించారు.

నేడు సింగరాయపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

మాచవరం: మండలంలోని సింగరాయపాలెం తండా గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొంటారని, గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ మట్టితవ్వకాలు జరగడంలేదు

దాచేపల్లి : మండలంలోని మాదినపాడు చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు జరగడంలేదని భూగర్భ గనులశాఖ సహాయ సంచాలకులు డి. రామమోహన్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. యథేచ్ఛగా మట్టి దోపిడి అని ఓ దినపత్రిక రాసిన కథనం పూర్తి నిరాధరమైందని, మాదినపాడు చెరువులో మట్టిని పొలాలు చదును చేసేందుకు రైతులు గతంలో తీసుకెళ్లారని ఆయన చెప్పారు. చెరువులో గతంలో మాదిరి తవ్వకాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

గురజాల : చదువుకు పేదరికం అడ్డుకాకుడదనే కారణంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని ఎఎస్‌డబ్ల్యూఓ సుజాత కుమారి అన్నారు. వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకుని పరీక్షల్లో మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. విద్యార్థులు మంచి సత్ప్రవర్తన కలిగి వుండాలన్నారు. అన్ని రంగాల్లో విద్యార్థులు అత్యున్నత స్థాయికి చేరినప్పుడు తప్పనిసరిగా విజయం సాధించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఇండెన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ డి హరి సుబ్రమణ్య రెడ్డి, మాచర్ల కమిషనర్ ఎంవి రమణబాబు, పల్నాడు జిల్లా విజిలెన్సు మానిటరింగ్ పి పోలేష్, జాషువ సాంస్కృతిక సమాఖ్య కన్వీనర్ ఆర్ ప్రసన్న కుమార్, వార్డెన్లు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

రెంటచింతల: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తే.. భవిష్యత్తుపై విద్యార్థులు పట్టు సాధిస్తారని ఎస్ఐ సయ్యద్ సమీర్ బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థి దారెడ్డి మణికంఠారెడ్డి ఆర్థిక సాయంతో పదో తరగతి విద్యార్థులకు అందజేసిన పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

రెంటచింతల: రెంటచింతలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంఈఓ ఐ.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం విద్యావనరుల భవనంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సెయింట్ జోసఫ్ హై స్కూల్‌లో 300, వైఆర్ఎస్ హై స్కూల్‌లో 234, సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 197 మంది.. మొత్తం 731 మంది పరీక్షలకు హాజరుకానున్నారని వెల్లడించారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు కేసీపీ సంస్థ కృషి

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మంచినీటి పథకానికి భూమి పూజ, శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీఆర్కే

వెల్దుర్తి: మండలంలోని మండాది గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించేందుకు కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ వారి ఆధ్వర్యంలో పైపులైన్‌ల నిర్మాణం చేయడం అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మండాది గ్రామంలో పైపు లైన్ నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన చేసి మాట్లాడారు. మండాది గ్రామంలో ఎన్ని బోరుబావులు ఏర్పాటు చేసినప్పటికీ భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీఆర్కే కేసీపీ యాజమాన్యంతో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరించారు. వేసవి కాలం రాగానే బోర్లు అడుగంటి పోతుండడంతో గ్రామస్తులు నీటి కోసం ఇబ్బందులు పడుతుండడంతో ముందు జాగ్రత్త చర్యగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీఆర్కే తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. రూ. 6.50 లక్షలతో దుర్గి మండలం తేరాల క్వారీ నుంచి మండాది వరకు పైపు లైన్లు ఏర్పాటు చేసేందుకు కేసీపీ యాజమాన్యం ముందుకొచ్చిందన్నారు. ఈ పనులను త్వరలోనే ప్రారంభించి మండాది గ్రామ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమౌతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ శీలం సైదారెడ్డి, ఎంపీటీసీ పేరుపోగు కాంతారావు, మాజీ సర్పంచ్ పులి త్రినాధరెడ్డి, కృష్ణారెడ్డి, ఈశ్వరరెడ్డి, చిన్నపరెడ్డి చినమల్లారెడ్డి, లింగారెడ్డి, తేరాల కొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు పార్లపల్లి పెదగాలయ్య, రవికుమార్, కెసిపి ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆసరాతో మహిళల ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

గురజాల: మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి చెందడానికి వైఎస్సార్ ఆసరా దోహద పడుతుందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక చల్లగుండ్ల గార్డెన్‌లో శనివారం మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలు పడుతున్న ఇబ్బందులను ప్రజా సంకల్ప యాత్రలో గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా పథకాన్ని అప్పుడు నవరత్నాల్లో చేర్చారని తెలిపారు. ప్రతి పథకంలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పాలన అందిస్తున్నారన్నారు. మహిళ పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తారన్నారు. కుటుంబాలు బాగుండాలంటే మహిళలు సహకారం అందించాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పాలన అందించడం జరుగుతుందన్నారు. గురజాల మండలంలోని 566 గ్రూపులకు 5722 సభ్యులకు 3,94,52,103 రూపాయలు ఆసరా ద్వారా అందించినట్లు తెలిపారు. ప్రతి మహిళా ఆనందంగా ఉండాలనే లక్ష్యంతో పలు పథకాలు రూపొందించినట్లు తెలిపారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌లు షేక్ బడేజానీ, ఎం కన్యాకుమారి ప్రసాద్, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, జెడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, పట్టణ కన్వీనర్ కె అన్నారావు, పౌరసరఫరాల శాఖ కమిటీ మెంబర్ కర్రా ప్రగతి కోటేశ్వరరావు,గురజాల మార్కెట్ యార్డు చైర్మన్ కె అంద్రెయ్య, షేక్ పీర్ అహ్మద్; మాజీ ఎంపీపీ వీరంరెడ్డి అమరారెడ్డి తదితరులున్నారు. మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ ఆసరా పథకం ద్వారా వచ్చిన నగదుతో డ్వాక్రా మహిళలు కుట్టు మిషన్లు కొనుగోలు చేసుకున్నారు. ఆ మిషన్లును ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో విజయం సాధించాలన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాసు, ఎమ్మెల్సీ జంగా



శంకుస్థాపనలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: పెద గార్లపాడు గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. కొమ్మూరి విశ్వరూపాచార్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పుణ్య దంపతులతో మహా యజ్ఞం చేయించారు. దేవాలయంతో పాటు పరివార దేవతల ఆలయాలు, గాలి గోపురాలు, కల్యాణ మండపం, అద్దాల మండపం, వాహన మండపం కూడా నిర్మించనున్నారు. మహా అన్నదానం చేశారు. శంకుస్థాపన పూజా కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పాల్గొని, పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్ రెడ్డి, సర్పంచ్‌లు కటికాల వరలక్ష్మి, పుప్పాల శివ, ఉప సర్పంచ్ కర్పూరపు వెంకట కోటయ్య, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, నాయకులు ముత్యం చెన్నారెడ్డి, లింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యులు పుప్పాల అప్పారావు, కానాల వెంకటరెడ్డి, యతిరాజుల శ్రీనివాసరావు, కటికాల చెన్నకేశవ రావు, బూసి రామారావు, తోట శివ పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసులు పంపిణీ



ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న సభ్యులు

మాచర్ల రూరల్: వాసవి క్లబ్ సేవలు ప్రశంసనీయమని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఓరుగంటి చిన్నా పేర్కొన్నారు. శనివారం కొత్తపల్లి ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వాసవి క్లబ్, మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో ప్లేట్లు, గ్లాసులు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ రంగా చెన్నకేశవరావు, జోన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, చుండూరు వెంకటేశ్వర్లు, ఉప కార్యదర్శి బచ్చు రాజ్‌కుమార్, చుండూరు సత్యనారాయణ, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

మాచర్ల: పట్టణంలో వలంటీర్‌గా, సొసైటీ కాలనీలో సత్యసాయి దేవాలయం సేవకుడిగా చేస్తున్న కొరటా వెంకటేష్ (37) అనే వ్యక్తి బంధువులతో కలిసి శ్రీశైలం వెళ్తుండగా శిఖరం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాల మేరకు.. శనివారం బంధువులతో కలిసి బొలెరో వాహనంలో వెంకటేష్ శ్రీశైలం వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ పూజారిని ఢీకొట్టడంతో అతను మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో కొరటా వెంకటేష్ కూడా కింద పడి మృతి చెందాడు. శ్రీశైలం దేవస్థానంలో పనిచేసే పూజారి, మరోవైపు మూడు సంవత్సరాల కుమార్తె ఉన్న మాచర్ల వాసి వెంకటేష్ చనిపోవటంతో ఈ ఘటన ఆ రెండు కుటుంబాలలో విషాదాన్ని నింపింది.

పశువులకు గాలికుంటు టీకాలు

కారెంపూడి: గాదెవారిపల్లెలో పశువులకు గాలికుంటు నిరోధక టీకాలను పశుసంవర్ధక శాఖ వైద్యులు డాక్టర్ డి.వెంకటేశ్వర్లు శనివారం వేశారు. గ్రామ సర్పంచ్ బైరెడ్డి చిన్న శ్రీనివాస రెడ్డి ప్రస్తుతం ప్రతి గ్రామంలో పశు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గ్రామ పెద్దలు బైరెడ్డి కోటిరెడ్డి, బారెడ్డి లక్ష్మారెడ్డి, గురజాల రామారావు, షేక్ సైదా, కొత్త కాశిరెడ్డి పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

దుర్గి: మండల పరిధిలోని రాజానగరం గ్రామానికి చెందిన బాపట్ల శ్రీను అనే పేద రైతుకు చెందిన ఆవు పిడుగుపాటుకు గురై మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు శనివారం మధ్యాహ్నం అకాల వర్షం తోడు పిడుగులు పడ్డాయి. అదే సమయంలో ఆవును మేత కోసం పొలంకి తీసుకెళ్ళాడు. ఆవు మీద పిడుగు పడడంతో అక్కడికక్కడే ఆవు మృతి చెందింది. రైతు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సుమారుగా రూ. 60 వేల విలువ గల ఆవు మృతి చెందడంతో రైతు కన్నీటి పర్యాంతమయ్యాడు. ఆర్థిక సాయం అందజేసిన వైఎస్సార్ సీపీ నాయకుడు విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు జక్కా రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని రైతును పరామర్శించారు. అనంతరం సమాచారాన్ని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి తెలిపారు. ఆయన సూచనల మేరకు బాధిత రైతుకు తక్షణ సాయంగా రూ. 5వేలు అందజేసి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. భూమిని తవ్వి గోమాతను సాంప్రదాయబద్ధంగా ఖననం చేశారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాసు

గురజాల : ప్రతి గడపకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బూదవాడ గ్రామంలో శనివారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా....ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న గ్రామంలో కూడా సచివాలయాలు ఏర్పాటు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరికి పథకం అందించే విధంగా చర్యలు చేపట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంతో పోలిస్తే ఈ ప్రభుత్వం ఎంతో బాగుందని వృద్దులు, మహిళలు ఆనందంగా ఎమ్మెల్యేకు తెలిపారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నాయకులు దాచుకో..దోచుకో అన్న చందాగా పాలన అందించారన్నారు. కానీ నేటి ప్రభుత్వం మాత్రం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే విదంగా వలంటీర్ వ్యవస్థ తీసుకురావడం ...గ్రామంలోనే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్ వంటివి అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజల మన్ననలు పొందిన నాయకుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతున్నారన్నారు. పక్క రాష్ట్రాలు సైతం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాలు బాగున్నాయని అందరి మన్ననలు పొందుతున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, జెడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, గ్రామ సర్పంచ్ రామిశెట్టి వెంకట నర్సమ్మ వెంకటేశ్వర్లు, వైస్ సర్పంచ్‌శ్రీపతి రాహుల్, మక్కెన అమరకృష్ణ, ఎస్ నాగేశ్వరరావు, దాసరి ముకుందు, రామిశెట్టి సైదేశ్వరరావు, కె సాంబయ్య, గురజాల మార్కెట్ యార్డు చైర్మన్ కె అంద్రెయ్య, షేక్ పీర్ అహ్మద్, వేలమూరి సైదారెడ్డి, షేక్ నాసర్‌సైదా, అమావాస్య నాగేశ్వరరావు తదితరులున్నారు.

పార్వేటకు వెళ్తూ కానరాని లోకాలకు..

పెద్దదోర్నాల: నంద్యాల జిల్లా ఆత్మకూరు సమీపంలోని ముష్టిపల్లిలో జరుగుతున్న పార్వేట ఉత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్తూ ఇద్దరు మృతిచెందిన సంఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. శనివారం శ్రీశైలం ఘాట్‌రోడ్డులో ఇష్టకామేశ్వరి ఆలయ ముఖద్వారం వద్ద బొలేరో వాహనం ఎదురుగా వచ్చిన స్కూటీని ఢీకొనడంతో పాటు లోయకు రక్షణగా వేసిన ఇనుప క్రాస్ వారియర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్న నంద్యాల జిల్లా శ్రీశైల పుణ్యక్షేత్రానికి చెందిన ఆలయ అర్చకుడు చిలిమికోటి శివనాగ ప్రసాద్ (40)తో పాటు పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన వార్డు వలంటీర్ కొరటా వెంకటేష్ (36) దుర్మరణం పాలయ్యారు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. కొద్ది నిముషాలకు ముందే తనతో పాటు పిల్లలతో మాట్లాడి బయలుదేరిన భర్త నట్టడవిలో విగతజీవుడిగా పడి ఉండడాన్ని జీర్ణించుకోలేక శివనాగప్రసాద్ భార్య బోరున విలపించింది. భర్త మృతదేహంపై పడి కన్నీరుమున్నీరవడం అందరినీ కలచివేసింది. పార్వేట ఉత్సవాల్లో పాల్గొనేందుకు అవసరమైన పూజాద్రవ్యాలను తీసుకుని శివనాగప్రసాద్ ఆత్మకూరు బయలుదేరాడు. కొద్దిసేపటికే రోడ్డు ప్రమాదం జరిగిందన్న సమాచారంతో ఘటన స్థలికి చేరుకున్న అతని భార్య.. నల్లమల అటవీప్రాంతంలో పడి ఉన్న భర్త మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమైంది. శివనాగప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

వెంకటేష్ మృతితో కన్నీటిపర్యంతమైన స్నేహితులు...

ఘోర రోడ్డు ప్రమాదంతో అనుకోని రీతిలో దుర్మరణం పాలైన తమ స్నేహితుడిని చూసిన వెంకటేష్ సహచరులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆడుతూ పాడుతూ మాచర్ల నుంచి శ్రీశైల పుణ్యక్షేత్రానికి బయలుదేరిన తమకు జరిగిన ప్రమాదంతో తమ సహచరుడు కన్నుమూశాడు అన్న వార్తను వారు జీర్ణించుకోలేకపోయారు. ఈ ప్రమాదంలో ఎక్కడో కారు వెనుక సీటులో కూర్చున్న వెంకటేష్ చనిపోవడం దారుణమని వారు విలపించారు. వెంకటేష్ కుటుంబానికి తామేమి సమాధానం చెప్పాలంటూ సొసైటీ కాలనీకి చెందిన సాంబశివరావు వాపోయాడు.

ఎక్స్‌ప్రెస్ సర్వీసులను సద్వినియోగం చేసుకోండి



ఆర్టీసి డిఎం పిచ్చయ్య

మాచర్ల: పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేటకు మాచర్ల నుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీసులను కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసి డిపో మేనేజర్ పిచ్చయ్య శనివారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నర్సరావుపేటకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు మూడు ట్రిప్పులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఉదయం మాచర్ల 6గం॥లకు, నర్సరావుపేట నుంచి 8.30గం॥లకు, మాచర్ల 11గం॥లకు, నర్సరావు పేట నుంచి 1.30గం॥లకు, మాచర్ల 4.30గంల నుంచి, నర్సరావు పేట నుంచి 6.30గం॥లకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచిత బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోండి...

పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ఆర్టీసి బస్సు సర్వీసులను నిర్వహిస్తోందని ఈ అవకాశాన్ని మూడవ తేదీ నుంచి పరీక్షలు ముగిసే వరకు ఉంటుందన్నారు. ఆయా గ్రామాల నుంచి 10వ తరగతి చదివే విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్టీసి ఉచిత సర్వీసుల ద్వారా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

మైన్స్ నిర్వహణకు ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

దాచేపల్లి : నగర పంచాయతీ శివారులో లైమ్ కంకర, లైమ్‌స్టోన్ తవ్వకాల కోసం ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకునేందుకు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సును శనివారం నిర్వహించారు. వైష్ణవి మినరల్స్ నిర్వాహకులు సర్వేనంబర్ 283లో 3.41 ఎకరాలు, సర్వేనంబర్ 285లో 11.61 ఎకరాల్లో లైమ్ కంకర, లైమ్‌స్టోన్ తవ్వకాల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. తవ్వకాలకు అనుమతులు ఇచ్చే క్రమంలో ప్రజల నుంచి అభ్యంతరాలు, అభిప్రాయాలు తెలుసుకునేందుకు డీఆర్వో కె. వినాయకం అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సును ఏర్పాటు చేశారు. లైమ్‌స్టోన్, లైమ్ కంకర తీసేందుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్థానికులు, రైతులు, ఎన్‌జీఓ ప్రతినిధులు సదస్సులో చెప్పారు. వైష్ణవి మినరల్స్ నిర్వాహకులు వున్నం నాగమల్లిఖార్జునరావు మాట్లాడుతూ...స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, ప్రభుత్వ నిబంధనల మేరకు తవ్వకాలు జరుపుతామని చెప్పారు, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. డీఆర్వో వినాయకం మాట్లాడుతూ...పర్యావరణాన్ని కాపాడే బాధ్యతను యజమాన్యం తీసుకోవాలన్నారు. సదస్సు ద్వారా ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆయన చెప్పారు. ఈ సదస్సులో ఆర్డీఓ కె. అద్దయ్య, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ఎం. నారాయణ, తహసీల్దార్ డి. మేరి కనకం తదితరులు పాల్గొన్నారు.

పథకాలు ప్రతి లబ్ధిదారునికి చేరాలి

మున్సిపల్ కమిషనర్ రమణబాబు



వైఎస్సార్ సంక్షేమ పథకాలపై సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణబాబు

మాచర్ల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి సచివాలయంలో పేదలకు చేరవేయడంతో పాటు సంబంధిత పథకాల లబ్ధి గురించి వివరించాల్సిన బాధ్యత సచివాలయ పరిధిలోని వెల్ఫేర్, మెప్మా ప్రాజెక్టు అధికారుల పై ఉందని మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు అన్నారు. శనివారం తన కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అధికారులు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పథకాన్ని ఆ కుటుంబంలో చేర్చి వారి ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత సచివాలయం, మెప్మా ప్రాజెక్టు అధికారుల పై ఉందన్నారు. అదే విధంగా ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికి దరిచేర్చేందుకు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన కోరారు. ఈ నెల 5వ తేదీన నిర్వహించే వైఎస్సార్ ఆసరా పథక చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతారని, ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేసేందుకు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు శాఖాధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికి తాగునీరు అందిస్తాం



పైపులైన్ల పనులకు పూజలు చేస్తున్న పార్టీ నేతలు

దాచేపల్లి : ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని ఎంపీపీ కటకం జయశ్రీ అన్నారు. మండలంలోని సారంగపల్లి అగ్రహారం గ్రామంలో రూ.32 లక్షలతో తాగునీటి పైపులైన్ల పనులను శనివారం ప్రారంభించారు. ఎంపీపీ జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి ప్రత్యేకంగా పూజలు చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందించాలనే లక్ష్యంగా పైపులైన్ల పనులు చేపట్టామని, 3 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేస్తున్నామని ఎంపీపీ జయశ్రీ చెప్పారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో జలజీవన్ మిషన్ ద్వారా విడుదలైన నిధులతో ఈ పనులు చేస్తున్నామని జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కందుల జాను, సర్పంచ్‌లు జాన్‌అహ్మద్, అనుముల అంజిరెడ్డి, ఉపసర్పంచ్ శానంపూడి అంకిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, ఎంపీటీసీలు నంద్యాల వీరారెడ్డి, ఆకూరి వెంకటరెడ్డి, నాయకులు ఉల్లేరు హనుమంతరావు, నెల్లూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విజయపురిసౌత్: ఈ నెల 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగబోయే 10వ తరగతి పరీక్ష కేంద్రాల్లోని వసతులను చీఫ్ సూపరిన్టెంట్ ఎస్ దేవరాజు శనివారం పరిశీలించారు. అనంతరం విలేకరలతో మాట్లాడుతూ పీటీజీ పాఠశాలలో 187 మంది రెగ్యులర్ విద్యార్థులు నలుగురు సప్లమెంటరీ విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. మొత్తం 9 తరగతి గదుల్లో, 9 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహిస్తారన్నారు. ఒక్కొక్క గదికి 22 మంది విద్యార్థులను కేటాయించినట్లు పేర్కొన్నారు. గదుల్లో వెంటిలేటర్లు, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయన వెంట డిపార్ట్‌మెంటర్ అధికారి ఎస్ రామకోటేశ్వరరావు, ప్రిన్సిపల్ శ్రీను నాయక్, సిబ్బంది ఉన్నారు. అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాల చీఫ్ సూపరిన్టెంట్ ఎం ఆశాలతా భాయి మాట్లాడుతూ పరీక్షా కేంద్రములో 4 తరగతి గదులలో ఒక్కొక్క గదికి 24 మంది విద్యార్థులను కేటాయించినట్లు తెలిపారు. మొత్తం 92 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 6గురు ఇన్విజిలేటర్లు పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు.

5న వైఎస్సార్ ఆసరా సంబరాలను జయప్రదం చేద్దాం

మాచర్ల: పట్టణంలో ఈ నెల 5వ తేదీన జరిగే వైఎస్సార్ ఆసరా పథకాన్ని విజయవంతం చేయడంలో లబ్ధిదారులైన ప్రతి డ్వాక్రా మహిళను భాగస్వామ్యం చేసి వారికి ప్రభుత్వ పథకం ద్వారా పొందిన లబ్ధిని తెలియపర్చాలని స్థానిక మెప్మా ప్రాజెక్టు మేనేజర్ ఎం సుబ్బారావు కోరారు. ఈ సందర్భంగా మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో ఆయన సీసీలు, ఆర్పీలు సమావేశం నిర్వహించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన మానుకొండ కల్యాణ మండపంలో నిర్వహించే వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి వార్డు నుంచి లబ్ధిదారుల మహిళలను తీసుకొచ్చి పథకాలను, వారు లబ్ధి పొందిన వివరాలు వివరించి కార్యక్రమాన్ని విజయవం చేయాలన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరై చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేస్తారన్నారు.

వాసవి సేవా సమితి ప్రతినిధుల పర్యటన

కారెంపూడి: వాసవి సేవా సమితి జిల్లా ప్రతినిధులు శనివారం కారెంపూడిలో పర్యటించారు. సమితిలో ప్రాతినిధ్యం వహించేందుకు ఆసక్తి చూపేవారి పేర్లు సేకరించారు. వివిధ హోదాల ఆర్యవైశ్య సంఘ నాయకులతో సమావేశాలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కొత్తమాసు సుధాకర్, ప్రధాన కార్యదర్శి తాడువాయి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఆతుకూరి నాగేశ్వరరావు, కార్యదర్శి తాళంకి శివాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. వారిని కారెంపూడి నాయకులు సన్మానించారు.